క్లుప్తంగా

బాధ్యతల స్వీకారం

రొంపిచెర్ల: చెంచెంరెడ్డిగారిపల్లె పంచాయతీ కార్యదర్శిగా శశిధర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ పోస్టు చాలా రోజులుగా భర్తీకి నోచుకోలేదు. ప్రస్తుతం జరిగిన సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో చిత్తూరు రూరల్ పంచాయతీ నుంచి ఆయన ఇక్కడికి వచ్చారు. అలాగే చిచ్చిలివారిపల్లె పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున పీలేరు మండలం అగ్రహారానికి బదిలీ అయ్యారు.

నేడు ఎస్టీ కమిషన్ సభ్యుడి రాక

రామకుప్పం: రాష్ట్ర ఎస్టీ కమీషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ శుక్రవారం ఉదయం 10.30 గంటలకు మండలంలోని వీర్నమల,పెద్ద తండాలో పర్యటించనున్నట్లు ఎంపీడీఓ రాధాకృష్ణ తెలిపారు. స్థానిక గిరిజన తండా ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణాపై నిఘా



సీఐను సన్మానిస్తున్న పోలీసులు

రొంపిచెర్ల: ఎర్రచందనం అక్రమ రవాణాపై పోలీసులు నిఘా ఉంచాలని కల్లూరు సీఐ కె.శ్రీనివాసులు తెలిపారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన రొంపిచెర్ల పోలీసు స్టేషన్‌ను గురువారం తనిఖీ చేశారు. గ్రామాల్లో ఎర్రచందనం తరలింపుపై ప్రత్యేక నిఘా వేయాలన్నారు. చోరీల నియంత్రణకు రాత్రి గస్తీ నిర్వహించాలని తెలిపారు. కేసుల నమోదు, దర్యాప్తుల పురోగతిపై సమీక్షించారు. ఏఎస్ఐలు తులసీరామ్, మధు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధిపై ఉచిత శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీపీ యువరాజు

వి.కోట: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీపీ యువరాజు తెలిపారు. గురువారం వెలుగు కార్యాలయంలో మండల యువతీ, యుకులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన వారికి స్పోకన్ ఇంగ్లిష్, కంప్యూటర్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై 3నెలలు శిక్షణ ఇచ్చి ప్రైవేటు, కార్పొరేట్ రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తారని చెప్పారు. ఏపీఎం సుబ్రమణ్యం మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. యువతులకు తిరుపతిలో, యువకులకు చిత్తూరు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణకు హాజరయ్యే వారికి భోజన, వసతి సౌకర్యం కల్పిస్తారని పేర్కొన్నారు.

మైనర్లకు బైకులిస్తే యజమానులపై కేసు



బైక్‌లు నడపమంటూ మైనర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ చంద్రశేఖర్

పలమనేరు: మైనర్లకు బైక్‌లిస్తే వాహన యజమానులపై కేసులు తప్పవని పలమనేరు సీఐ చంద్రశేఖర్ హెచ్చరించారు. కొన్నాళ్లుగా పట్టణంలో వేగంగా నడుపుతున్న బైక్ రైడింగ్‌లు, మైనర్ రైడింగ్‌లు, హైవేలో బైక్ రేస్‌లపై డీఎస్పీ సుధాకర్‌రెడ్డి ఆదేశాలతో పోలీసులు గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బైక్‌లను నడుపుతున్న 20మంది మైనర్లను పట్టుకుని, వాహనాలను సీజ్‌చేశారు. తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇకపై బైక్‌లు నడపమంటూ మైనర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణంలో కళాశాలలు వదిలే సమయంలో కొందరు అదేపనిగా సైలెన్సర్లు తీసేసి విపరీతమైన శబ్దంతో బైక్‌లను నడుపుతూ మహిళలు, విద్యార్థినిలను భయాందోళనకు గురిచేస్తున్నట్లు తెలిసిందన్నారు. మరికొందరు పట్టణ సమీపంలోని బైపాస్‌లో ఒంటి చక్రంతో బైక్‌లను నడపడం, బయటి ప్రాంతాల వారు సైతం ఇక్కడిదాకా బైక్ రైడింగ్‌లు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించి హైవేలోని సీసీ కెమెరాల ద్వారా బైక్ రైడర్లను పట్టుకుంటామని తెలిపారు.

వేధింపుల హోంగార్డుపై చర్యలు తీసుకోవాలి

పలమనేరు: రెండోసారి ఆడపిల్ల పుట్టిందని భార్యను వేధించి అన్నం, నీళ్ల లేకుండా బాత్‌రూమ్‌లో పెట్టి చిత్రహింసలకు గురి చేసిన పట్టణానికి చెందిందిన హోంగార్డు చాంద్‌బాషాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా కన్వీనర్ భువనేశ్వరి డిమాండ్ చేశారు. తమ కార్యాలయంలో ఆమె గురువారం మీడియాతో మాట్లాడుతూ.. సభ్య సమాజం తలదించుకొనేలా ప్రవర్తించిన ఇలాంటి శాడిస్ట్ భర్తలపై కఠిన చర్యలను తీసుకోవాలని ఆమె పోలీసులను కోరారు. ఇలాంటి పని మరొకరు చేయకుండా విధుల నుంచి తొలగించి, తగిన శిక్ష పడేలా చూడాలని కోరారు.

అన్నివర్గాల అభ్యున్నతే ధ్యేయం



సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పెద్దపంజాణి: పేదల కష్టాలు తెలిసిన ప్రభుత్వం తమదని, అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. గురువారం మండలంలోని చిన్నవెలగటూరు, ఓబులాపురం, షికారిపాళ్యం గ్రామాల్లో అధికారులు, వలంటీర్లు, ప్రజా ప్రతినిధులతో కలసి మూడవ రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఆయా కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించారు. నాలుగేళ్లలో అందజేసిన పథకాలు ఏ మేరకు వారికి అందాయో వివరించి సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక సమస్యల గుర్తింపు, పరిష్కారం నిరంతరం జరిగితేనే ప్రభుత్వ ఆశయం నెరవేరుతుందని, అందులో భాగంగానే గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అర్హత ఉండి ఏ కారణం చేతనైనా పథకాలు అందకుండా ఉంటే దరఖాస్తు చేసుకుంటే పరిష్కరిస్తామని తెలిపారు. గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల వద్దకు పాలన అందిస్తున్నారన్నారు. పథకాలను పారదర్శకంగా లబ్ధిదారుల ఇంటికే అందిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలన్నీ సుమారు 98 శాతం ముఖ్యమంత్రి అమలు చేశారన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెప్ప, జెడ్పీటీసీ సభ్యురాలు సుష్మకీర్తి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగా రెడ్డి, వైస్ ఎంపీపీలు జీడీ బాబు, ఆంజమ్మ, సింగిల్ విండో చైర్మెన్ ఓబుల్ రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు హరినాథ్, కో–ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, పార్టీ జిల్లా కార్యదర్శులు తమ్మిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్‌లు ఎర్రబల్లి శ్రీనివాసులు, సురేష్, సర్పంచ్ చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యుడు మోహన్ రెడ్డి, నాయకులు రాజా రెడ్డి, డీలర్ శంకర్ రెడ్డి, నాగ శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు తిరగబడితే పవన్ పరిస్థితేంటి?



ఎన్ నాగరాజు

వి.కోట: వలంటీర్లంతా తిరగబడితే పవన్‌కల్యాణ్ వారాహి వాహనంలో పారిపోవాల్సి వస్తుందని, పవన్ కళ్యాణ్ నోరు అదుపులో పెట్టుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీ ఎన్ నాగరాజు హితవు పలికారు. గురువారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో పవన్‌కల్యాణ్ వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా మండిపడ్డారు. ప్రభుత్వ పథకాలను ఇళ్ల వద్దకే అందించేందుకు ఏర్పాటు చేసిన వలంటీర్ల వ్యవస్థకు మంచి పేరు వస్తోందన్నారు. ప్రతి కుటుంబం వైఎస్సార్ సీపీకి ఎక్కడ వేస్తారోనన్న భయంతో వలంటీర్లపై పవన్‌కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం గర్హనీయమని తెలిపారు. గతంలో అవ్వా, తాతలు పింఛన్ కోసం మండల కార్యాలయాల వద్ద రోజుల తరబడి వేచి ఉండాల్సి వచ్చేదని, ప్రస్తుతం ఇంటి వద్దకే ఒకటో తేదీనే వలంటీర్లు పింఛన్ అందజేస్తున్నారని పేర్కొన్నారు. కరోనా మహమ్మారి కాలంలో వలంటీర్ల సేవలు ఎనలేనివన్నారు.

సమజ సేవకులనే దూషిస్తారా?



బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి

బైరెడ్డిపల్లె : ప్రజలకు వలంటీర్ల ద్వారా జగనన్న సర్కారు మంచి చేయడాన్ని జనసేన అధినేత పవన్, టీడీపీ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తట్టుకోలేక పోతున్నారని వైఎస్సార్ సీపీ రాజంపేట ఎన్నికల పరిశీలకుడు బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి అన్నారు. గురువారం బైరెడ్డిపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో జన్మభూమి కమిటీలు లంచాలకు, దుర్మార్గపు పనులకు తెరలేపితే వలంటీర్లు అందుకు భిన్నంగా కుటుంబ సభ్యుల్లో ఒకరిగా మెలిగి సేవలందిస్తున్నారన్నారు. సాక్షాత్తు దేశ ప్రధాని నరేంద్రమోడీ వలంటీర్ల సేవలు భేష్ అంటూ ప్రశంసిస్తే, పవన్, చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజలందరూ గమనిస్తున్నారని తెలిపారు. కరోనా సమయంలో పవన్, చంద్రబాబునాయుడు హైదరాబాద్‌లో ఇళ్లకు పరిమితమైతే ఆ సమయంలోనూ ప్రజలకు సేవలందించిన గొప్ప సేవకులు వలంటీర్లని కొనియాడారు.

పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మ దహనం

పులిచెర్ల(కల్లూరు): తమపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్‌కల్యాణ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. కల్లూరు నాలుగు రోడ్ల కూడలిలో గురువారం పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. చిత్తశుద్ధితో పనిచేసే వలంటీర్లపై అనుచితంగా మాట్లాడడం తగదన్నారు. అనంతరం పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను చీపురుతో కొడుతూ దహనం చేశారు. ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్, నాయకులు రెడ్డీశ్వరరెడ్డి, ఎస్ఎస్ రెడ్డి ప్రకాష్, పోకల చంద్ర, ముర్వత్‌బాషా, నాగరాజప్రసాద్, రాయల్‌మోహన్, షకూర్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎనిమిది మంది ఎంపిక



తస్మియా, పూజిత,సదుం　సమీర,రొంపిచెర్ల

సదుం: పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపడంతో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఇద్దరు, ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాల్లో ఆరుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో తస్మియా, పూజిత ఎంపికయినట్టు హెచ్ఎం సుబ్రమణ్యం గురువారం తెలిపారు. గురుకుల పాఠశాలలో రాకేష్ యాదవ్, హరీష్, రుతిక్‌సాయి, రంజిత్‌కుమార్, నీరజ్, గౌతమ్ ఎంపికయినట్టు ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

రొంపిచెర్ల విద్యార్థిని..

రొంపిచెర్ల: రొంపిచెర్ల బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని సమీరా వైఎస్సార్ కడప జిల్లాలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. పెద్ద మసీదు వీధికి చెందిన అబిబ్ బాషా కుమార్తె సమీరా టెస్ట్‌లో 600కు 568 మార్కులు సాధించింది. బాలికను ఉపాధ్యాయులు అభినందించారు.

నాడు-నేడు పనులపై సమీక్ష



మాట్లాడుతున్న వెంకట రమణారెడ్డి

రొంపిచెర్ల: పాఠశాలల్లో నాడు–నేడు పనులను వేగవంతం చేయాలని సర్వశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ పెద్దిరెడ్డి వెంకటరమణరెడ్డి అన్నారు. ఆయన గురువారం రొంపిచెర్ల ఎంఈఓ కార్యాలయంలో హెచ్ఎంలతో నాడు–నేడు పనులపై సమీక్షించారు. ఈనెలాఖరు లోపు పనులను పూర్తి చేయాలన్నారు. నిధుల సమస్య ఉంటే నిధులు ఎక్కువగా ఉన్న పాఠశాలల ఖాతాల నుంచి బదిలీ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆదర్శ పాఠశాల భవన నిర్మాణ పనులకు సంబంధించి నిధులను మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఎంఈఓలు ఇందిర, శ్రీనివాసులు, ప్రిన్సిపల్ సరళ, సీఆర్‌పీలు రాజేంద్ర, కిరణ్, అనసూయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పులిచెర్ల(కల్లూరు): మండలంలో జరుగుతున్న నాడు–నేడు పనుల పురోగతిపై పులిచెర్ల హైస్కూల్లో గురువారం అధికారులతో సర్వశిక్ష అభియాన్ అడిషినల్ కోఆర్డినేటర్ వెంకటరమణారెడ్డి సమీక్షించారు. నాడు– నేడు రెండవ విడతలో జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఎంఈఓలు సిద్దరామయ్య, తాతయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

భరత్‌కు ప్రశంసాపత్రం



భరత్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: టీమ్ జగనన్న యాప్ ద్వారా రాష్ట్ర సంక్షేమ ప్రగతిని సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్న వారిలో పలమనేరు నియోజకవర్గంలో టాప్‌లో నిలచిన భరత్ స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ నుంచి గురువారం ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడతూ తనకు ఈ అవార్డు ద్వారా మరింత బాధ్యత పెరిగిందన్నారు.

వలంటీర్లకు వందనం — కరోనాలో కూతురిలా..



కరోనా సమయంలో చౌడేపల్లెకు చెందిన లక్ష్మమ్మకు ప్రభుత్వ సాయం అందజేస్తున్న వలంటీర్ శ్రావణి

చౌడేపల్లె: కరోనా కష్టకాలంలో బంధుమిత్రులు సహ ఒకరికొకరు లేకుండా పోయారు. ఫలితంగా పేదలు, నా అన్నవారు లేని వృద్ధుల జీవనం అస్తవ్యస్తంగా మారింది. ఆ సమయంలో వలంటీర్లు చేసిన సేవలు ఎప్పటికీ మరచిపోలేం. కరోనా మహమ్మారి సోకి వారి వద్దకు కుటుంబ సభ్యులు సైతం వచ్చి వారి కష్టసుఖాలను తెలుసుకోలేదు. అయితే చౌడేపల్లెకు చెందిన వలంటీర్ శ్రావణి వారంలో మూడుసార్లు తన పరిధిలోని కుటుంబాలలో ప్రతి ఇంటికీ వెళ్లి అందరినీ పలకరించి, ఏమైనా అవసరమో లేదో తెలుసుకుని వెళ్లేవారు. వేకువజామునే వచ్చి వృద్ధులకు ప్రభుత్వ సాయంతోపాటు పింఛన్ అందించారు. ఏ సమస్య ఉన్నా ఫోన్ చేసిన వెంటనే స్పందించారు. ఆమె తన పరిధిలోని ఇళ్లలోని సభ్యులకు కన్న కూతురి కంటే ఎక్కువగా సేవలందిస్తోంది.

అండగా నిలిచింది..



“ నేను కరోనా సమయంలో అనేక అగచాట్లు పడ్డాను. వయస్సు మీరడంతో బయటకు పోయే పరిస్థితి లేనందున ఇంట్లోనే ఉన్నాను. అలాంటి సమయంలో మా వలంటీరు శ్రావణి ధైర్యంగా ముందుకు వచ్చి నిత్యావసర సరుకులు తెచ్చి ఇచ్చింది. అలాగే ప్రభుత్వ సాయం రూ.వెయ్యితో పాటు, పింఛన్ నగదు కూడా ఇచ్చింది. ఎందుకని ప్రశ్నిస్తే..పేదల కోసం ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పింది. అటువంటి వలంటీర్లపై అసత్యాలు ప్రచారం చేయడం దురదృష్టకరం.

– కఠారి లక్ష్మమ్మ, చౌడేపల్లె

మేనిఫెస్టోను మాయం చేసిన చంద్రబాబు



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం: ఎన్నికల వేళ హామీలు ఇవ్వడం, తర్వాత మరచిపోవడం చంద్రబాబు నైజమని, మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావిస్తూ ఇచ్చిన ప్రతి హామీని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నెరవేరుస్తున్నారని ఎమ్మెల్సీ భరత్ చెప్పారు. గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కెనమాకులపల్లె పంచాయతీ వెంకటేపల్లె, ఎద్దులపల్లె గ్రామాల్లో ఆయన పర్యటించారు. ప్రతి కుటుంబానికి అందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి, ఇతర అవసరాలను అడిగి తెలుసుకున్నారు. గతంలో వందల హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తర్వాత మేనిఫెస్టోను మాయం చేశారని గుర్తు చేశారు. కానీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 99 శాతం అమలు చేశారని చెప్పారు. ప్రతి కుటుంబం అభివృద్ధి చెందితే రాష్ట్రం అభ్యున్నతి చెందినట్టేనన్నారు. ప్రతి ఇంటికీ వివిధ పథకాలతో నేరుగా బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతోందని చెప్పారు. గత టీడీపీ పాలనలో ఆ పార్టీ అనుయాయులు మాత్రమే లబ్ధి పొందేవారని పేర్కొన్నారు. నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల రూపురేఖలు పూర్తిగా మారాయన్నారు. పేద పిల్లలకు నాణ్యమైన ఇంగ్లిషు విద్య, జగనన్న గోరుముద్ద కింద పౌష్టికాహారం అందుతున్నాయని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల కొరత లేకుండా చేయడంతో పాటు 104, ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా వైద్యాన్ని ఇంటి ముంగిటకే తెచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, స్థానిక సర్పంచ్ ఏవీ జయరాం, ఎంపీటీసీ సభ్యుడు రాజప్ప, నాయకులు చెంగప్ప, మునిరత్నం గౌడు, జోనిరామమూర్తి, చంద్రప్ప, నాదమణి, పూలకుంట భాస్కర్, రమేష్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు



పుంగనూరు: ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న నాగభూషణం, అలీమ్‌బాషా

పుంగనూరు: ప్రతి ఇంటి సమస్యలను జగనన్న సురక్ష సర్వే ద్వారా పరిశీలించి పరిష్కరిస్తున్నట్లు జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం తెలిపారు. గురువారం పట్టణంలోని నాగపాళ్యం, కేజీఎస్‌వీధి, ఉర్దూ స్కూల్ వీధి, నానబాలవీధి ప్రాంతాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 11 రకాల ధ్రువపత్రాలను అప్పటికప్పుడు లబ్ధిదారులకు అందజేశారు. నాగభూషణం మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పుంగనూరు మున్సిపాలిటిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు. పట్టణ పరిధిలోని 31వ వార్డుల్లో కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, గృహ సారథులు, వలంటీర్లు, ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు నమోదు చేసి అప్పటికప్పుడు పరిష్కరించే కార్యక్రమం చేపడుతామన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు నాగేంద్ర, లలిత, కౌన్సిలర్లు కిజర్‌ఖాన్, అర్షద్‌అలి, జేపీ యాదవ్, కన్వీనర్ వరదారెడ్డి, వైఎస్సార్ మజ్దూర్ అధ్యక్షుడు జయరామిరెడ్డి పాల్గొన్నారు.

తమ్మినాయనిపల్లె సచివాలయ పరిధిలో

సోమల: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని ఎంపీపీ ఈశ్వరయ్య అన్నారు. గురువారం తమ్మినాయనిపల్లె సచివాలయ పరిధిలో వైస్ ఎంపీపీ సయ్యద్ బాషా, సర్పంచ్ సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. దరఖాస్తుదారులకు 277 సర్టిఫికెట్లను ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్ బాబు, మండల స్పెషలాఫీసర్ శివకుమార్, ఎంపీడీఓ నాగరాజ, ఆర్ఐ సుబుక్తుల్లా, కార్యదర్శులు వెంకటరమణ, నాగభూషణం పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

గుడుపల్లె: జగనన్న సురక్ష పథకం కింద ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ వరలక్ష్మి పేర్కొన్నారు. గురువారం కనమనపల్లెలో జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించారు. వివిధ సర్టిఫికెట్లను అందజేశారు. జేసీఎస్ కన్వీనర్ రామకృష్ణ, సర్పంచ్ భాస్కర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం

సదుం: అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. కంభంవారిపల్లె సచివాలయంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 209 మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, సర్పంచ్‌లు రెడ్డిదీప, రేణుక, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, వాటర్‌షెడ్ చెర్మెన్ దుర్గాప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పంపిణీ

పులిచెర్ల(కల్లూరు): జగనన్న సురక్షలో సమస్యలు ఎప్పటికప్పుడు తీరుతున్నాయని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ తెలిపారు. గురువారం ఎర్రపాపిరెడ్డి గారిపల్లె, కల్లూరు సచివాలయల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు.

ప్రతి కుటుంబానికీ మేలు

పెద్దపంజాణి: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి మేలు చేకూరుతుందని జెడ్పీటీసీ సభ్యురాలు సుష్మకీర్తి అన్నారు. మండలంలోని కోగిలేరు సచివాలయ పరిధిలో సర్పంచ్ రమేష్ బాబు ఆధ్వర్యంలో గురువారం సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. దరఖాస్తుదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగారెడ్డి, ప్రత్యేకాధికారి రవికుమార్, ఎంపీడీఓ భాస్కర్, పీఎస్ మహేశ్వర్ పాల్గొన్నారు.

వారంలో 850 మందికి సర్టిఫికెట్లు

బైరెడ్డిపల్లె : మండలంలోని గంగినాయనపల్లె, గొల్లచీమనపల్లె సచివాలయాల్లో గురువారం జగనన్న సురక్ష శిబిరంలో వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప మాట్లాడుతూ మండలంలో వారం రోజుల్లో 850 మందికి ఉచితంగా వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేసినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ రాజంపేట ఎన్నికల పరిశీలకుడు బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, ఎంపీడీఓ రాజేంద్రబాలాజీ, తహశీల్దార్ కుమారస్వామి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలు మరింత చేరువ

రామకుప్పం: జగనన్న సురక్ష కార్యక్రమం కింద ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ అయ్యాయని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి అన్నారు. మండలంలోని ఉన్సిగానిపల్లి పంచాయతీ పరిధిలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో–కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్ నేత్రావతి, రెస్కో డైరెక్టర్ నాగిరెడ్డి, మురుగేష్, పార్టీ ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మంజునాథ్ పాల్గొన్నారు.

అబకలదొడ్డిలో 387 మందికి..

శాంతిపురం: అబకలదొడ్డి, 64 పెద్దూరు సచివాలయాల్లో జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించారు. అబకలదొడ్డిలో 387 మందికి, 64పెద్దూరులో 329 మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలు, సేవలను అందించారు. ఎంపీడీఓ హేమమాలిని, తహసీల్దార్ నరసింహులు ఆధ్వర్యంలో జరిగిన క్యాంపుల్లో వైస్ ఎంపీపీ పట్టాభి, సర్పంచులు రాధాకృష్ణ, చిన్నప్ప, ఎంపీటీసీ సభ్యుడు యువరాజ్, నాయకులు మురుగేష్, సోమరామిరెడ్డి పాల్గొన్నారు.

పెద్దకొండామర్రి సచివాలయంలో..

చౌడేపల్లె: మండలంలోని పెద్దకొండామర్రి సచివాలయంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ప్రజలనుంచి వచ్చిన సమస్యలను అధికారులు పరిష్కరించారు. 57మందికి ధ్రువీకరణ పత్రాలను అందజేసినట్లు మండల ప్రత్యేక అధికారి ప్రసాద్ తెలిపారు. ఎంపీపీ రామమూర్తి, సర్పంచ్ జయసుధమ్మ, ఎంపీడీఓ సుధాకర్ పాల్గొన్నారు.



సదుం: లబ్ధిదారులతో నాయకులు



సోమల: తమ్మినాయనిపల్లెలో సర్టిఫికెట్ల పంపిణీ



గుడుపల్లె: మాట్లాడుతున్న ఎంపీపీ



పులిచెర్ల: ఎర్రపాపిరెడ్డిగారిపల్లెలో..



పెద్దపంజాణి : సర్టిఫికెట్ల అందజేత



బైరెడ్డిపల్లె : గొల్లచీమనపల్లెలో..



రామకుప్పం : ధ్రువపత్రాల అందజేత

ప్రకృతి సాగుతో అధిక దిగుబడులు

చౌడేపల్లె: సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా అధిక దిగుబడులు సాధించ వచ్చని వ్యవసాయశాఖ జిల్లా అడిషినల్ ప్రాజెక్టు మేనేజర్ పట్టాభిరెడ్డి సూచించారు. మండలంలోని కాగతి పంచాయతీ యల్లంపల్లె వద్ద ప్రకృతి సాగు చేస్తున్న రైతుల పంట పొలాలను గురువారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారిస్తే నాణ్యమైన దిగుబడులు వస్తాయని పేర్కొన్నారు. వేరుశనగలో రక్షక పంటగా కంది, అలసంద, అనుములు, ఆముదాలు అంతర పంటగా వేసుకోవాలని సూచించారు. ఎస్ఎఫ్ఏ ఫైజున్నీసా, మాస్టర్ ట్రైనర్ రెడ్డికుమారి, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయంతో డీకేటీ రైతుల్లో ఆనందం



ధ్రువపత్రాలను అందిస్తున్న ప్రజాప్రతినిధులు

పలమనేరు: దశాబ్దాలుగా డీకేటీ భూములతో బ్యాంకులో రుణాలు పొందలేక, అత్యవసరమైతే విక్రయించుకోలేక పడుతున్న కష్టాలను చూసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డీకేటీలను సైతం విక్రయించుకొనేలా నిర్ణయం తీసుకోవడంతో డీకేటీ రైతుల్లో ఆనందం వెల్లివిరిస్తోందని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొలమాసనపల్లెలో జగనన్న సురక్ష కార్యక్రమం సర్పంచ్ గోవిందుస్వామి అధ్యక్షతన, స్పెషలాఫీసర్ కిశోర్‌నాయక్ పర్యవేక్షణలో జరిగింది. ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో 70 శాతం డీకేటీ భూములే ఉన్నాయన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో రైతులకు ఎంతో మేలు జరిగినట్లు తెలిపారు. దీంతో పాటు నిరుపేదలకు భూపంపిణీ చేపట్టడం హర్షించదగ్గ విషయమేనన్నారు. 334 మందికి వివిధ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. రాష్ట్ర కార్యదర్శి రంగన్న, సచివాలయాల కన్వీనర్ తిరుమలేష్, ఎంపీటీసీ సభ్యురాలు మేనక, కార్యదర్శి భాస్కర్ పాల్గొన్నారు.